ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- రేపటి నుంచి ప్రారంభం కానున్న లోక్‌సభ ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది.

- 'సంచార్ సాథీ' వేదిక ద్వారా ఇప్పటివరకు 5 వేల కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక నష్టాలను నివారించగలిగామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

- రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 74.85 పోలింగ్ శాతం నమోదైంది.

- ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు కోరారు.

==========

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి పొందడంలో 'సంచార్ సాథీ' వేదిక ఎంతో ఉపయోగపడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వివరించారు. ఈ పోర్టల్‌ను 30 కోట్ల మందికి పైగా సందర్శించారని, యాప్‌ను సుమారు 3 కోట్ల సార్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. ఆకాశవాణిలో ఈరోజు ప్రసారమైన 'మన్ కీ బాత్' మనసులోని మాట కార్యక్రమం 140వ సంచికలో ప్రధానమంత్రి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 'సంచార్ సాథీ' వేదిక ద్వారా ఇప్పటివరకు 5 వేల కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక నష్టాలను నివారించగలిగామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు చెందిన వివేక్ అల్లరి బాధ్యతాయుత పౌరుడిగా సంచార్ సాథీ వేదికపై 900లకు పైగా మోసపూరిత నంబర్లను నమోదుచేసారని, తద్వారా సుమారు 17 వేల మొబైల్ కనెక్షన్లు రద్దయ్యాయని నరేంద్ర మోదీ అభినందిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========

ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా చేపట్టిన 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం 100వ విడత పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని, 30 వేలకు పైగా ప్రాంతాల్లో 37 లక్షల మంది ఇందులో భాగస్వాములయ్యారని తెలిపారు. ఆకాశవాణి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ఈరోజు మాట్లాడారు. 2032 యూసీఐ రోడ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు పుణె ఆతిథ్యం ఇవ్వనుందని వెల్లడించారు. భారత ఫుట్‌బాల్ జట్టు రికార్డు స్థాయిలో 10వ సారి సాఫ్ (SAFF) ఛాంపియన్‌షిప్ గెలవడం, పి.వి.సింధు హైలో ఓపెన్ టైటిల్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వచ్చే నెల 11 నుంచి 22వ తేదీ వరకు తెలంగాణలోని 6 నగరాల్లో జరగనున్న 8వ `ఖేలో ఇండియా యూత్ గేమ్స్`లో పాల్గొనే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఊబకాయం దేశానికి పెనుసవాలుగా మారుతోందని, ప్రజలు తమ ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని, వ్యాయామంపై దృష్టి పెట్టాలని ప్రధానమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

==========

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఈరోజు మధ్యాహ్నం ఒంటి గంటతో ముగిసింది. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా 27 జిల్లాల్లోని 246 మండలాల్లో పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 74.85 పోలింగ్ శాతం నమోదైంది. అత్యధికంగా మార్కాపురంలో 83.50 శాతం, విజయనగరంలో 83.07 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధిస్తున్నారు. ఇప్పటివరకూ వెల్లడైన ఫలితాల్లో 2 వేల 215 పంచాయతీలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 650కి పైగా స్థానాల్లో గెలుపొందారు.

విరామం

==========

రేపటి నుంచి ప్రారంభం కానున్న లోక్‌సభ ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది. రాజ్యాంగ 132వ సవరణ బిల్లు-2026, నియోజకవర్గాల పునర్విభజన రెండో బిల్లు-2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ రెండో బిల్లు-2026ను సభ ముందుకు తీసుకురానుంది. ఈ బిల్లుల ఆమోదంతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య 50 శాతం పెరగడంతో పాటు.. 2029 లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలులోకి రావడానికి మార్గం సుగమం కానుంది. రేపు ప్రారంభం కానున్న లోక్‌సభ నాలుగు రోజుల ప్రత్యేక సమావేశాలు గురువారంతో ముగియనున్నాయి. మరోవైపు, డిసెంబర్ 2వ తేదీ నుంచి రెండు రోజుల పాటు రాజ్యసభ సమావేశాలు జరగనున్నాయి.

==========

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకువస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలుగు ప్రజలు, మహిళల తరఫున ధన్యవాదాలు తెలిపారు. దేశంలో మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాధాన్యం లేదని, గతంలో రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందినా.. లోక్‌సభలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. అయినప్పటికీ నరేంద్ర మోదీ పట్టువదల కుండా మళ్లీ బిల్లును ప్రవేశ పెడుతున్నారని, ఈసారి ఉభయ సభల్లో ఖచ్చితంగా ఆమోదం లభిస్తుందన్న విశ్వాసం ఉందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

==========

సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవస్థానంలో డిసెంబర్ 1వ తేదీ నుంచి అమలు చేయనున్న సంప్రదాయ వస్త్రధారణ నిబంధనల్లో ఎలాంటి మార్పు లేదని ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణయించిన తేదీ నుంచి డ్రెస్ కోడ్ నిబంధనలు తప్పనిసరిగా అమల్లోకి వస్తాయని, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు దేవస్థానం నిర్దేశించిన సంప్రదాయ వస్త్రధారణతోనే రావాలని ఆయన తెలిపారు. వచ్చేనెల 1 నుంచి నిబంధనల అమలులో ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేశారు. పురుషులు ధోతీ, కుర్తా, పైజామా లేదా సంప్రదాయబద్ధమైన షర్ట్, ప్యాంట్ ధరించి దర్శనానికి రావచ్చు. మహిళా భక్తులు చీర, లంగా ఓణీ లేదా దుపట్టాతో కూడిన చుడీదార్ ధరించాలి.

==========

ఆంధ్రప్రదేశ్‌లో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆధ్వర్యంలో ఎన్నికలకు సంబంధించిన తుది గణాంకాలను ప్రకటించారు. రాష్ట్రంలోని 25 జిల్లాలు, 46 రెవెన్యూ డివిజన్లు, 214 మండలాల పరిధిలో మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పోలవరం, తిరుపతి జిల్లాల్లో ఈ విడత ఎన్నికలు నిర్వహించడం లేదని ఎస్ఈసీ స్పష్టం చేసింది. మూడో విడతలో మొత్తం 4 వేల 244 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా, 932 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

==========

భక్తుల సౌకర్యార్థం కార్తీకమాసంలో ప్రతి ఆదివారం పంచారామాల యాత్రలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. పంచారామాల దర్శనం చేసుకోవాలనుకునే భక్తులు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని వినియోగించుకొని సురక్షితంగా యాత్ర పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా శబరిమల అయ్యప్ప స్వామి దర్శనార్థం ఐదు రోజులు, ఏడు రోజుల యాత్ర ప్యాకేజీలతో పాటు భక్తుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక యాత్రలకు కూడా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

==========
==========